
తిరుమల కిటకిట



తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడ వీధులు, లడ్డూప్రసాద కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్ ప్రాంతాల్లో ఈ రద్దీ అధికంగా కనిపిస్తోంది. కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య కూడా బాగా పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ మీదుగా రింగ్‌రోడ్డులో శిలాతోరణం వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేరకు వ్యాపించింది.కాటేజీల కోసం, తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పడుతోంది. సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, శ్రీవారిపాదాల ప్రాంతాల్లో రద్దీ నెలకొంది.అలిపిరి చెక్‌పాయింట్‌లోనూ వాహనాలు భారీగా నిలిచిపోవడంతో తనిఖీలను వేగవంతం చేశారు.




వర్షంతో పెరిగిన చలి

తిరుమలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లగా మారింది. మధ్యాహ్నం తర్వాత భారీ వర్షం కురవడంతో దర్శనం కోసం చంటిబిడ్డలతో వచ్చినవారు, వృద్ధులు అగచాట్లు పడ్డారు. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, కాటేజీలు, రోడ్లు జలమయమయ్యాయి. సాయంత్రం శేషాచల కొండలు తెల్లటి మేఘాలతో కనువిందు చేశాయి. వర్ష ప్రభావంతో తిరుమలలో చలితీవ్రత పెరిగింది.తిరుపతిలోనే శుక్రవారం సాయంత్రం కాసేపు చినుకులు పడడంతో వాతావరణం చల్లబడింది.



పెళ్లివేడుక



పెండ్లి మండపం వద్ద గజవాహనంపై మలయప్ప స్వామి

రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో శోభాయమానంగా తీర్చిదిద్దిన పరిణయ మండపం....గజవాహనాన్ని అధిరోహించి ఊరేగింపుగా వచ్చిన వరుడు మలయప్ప స్వామి....పల్లకిపై వెన్నంటి చేరుకున్న శ్రీదేవి, భూదేవి... తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనం వద్ద శుక్రవారం సాయంత్రం పద్మావతి పరిణయోత్సవ వేడుక దృశ్యమిది. - తిరుమల



కల్యాణోత్సవం


జాతర కళ



తిరుపతి గంగ జాతరలో శుక్రవారం వివిధ కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. తప్పెటగుళ్లు, కేరళ సంప్రదాయ వాద్యసంగీతం, దుర్గామాత అలంకారంలో దుష్టసంహారం అలరించాయి.



చేస్తారా.... చేయరా?



డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌కు వైసీపీ ముఖ్య నేత ఒత్తిడి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విలువైన డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేసివ్వాలంటూ వైసీపీ ముఖ్యనేత అధికారులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గవ్యాప్తంగా వందలాది ఎకరాల డీకేటీ భూములను కొద్ది నెలల క్రితం ఫ్రీ హోల్డ్ జాబితాలో పెట్టారు. డీకేటీ పట్టా పొంది 20 ఏళ్లు పూర్తయిన భూములను ఫ్రీ హోల్డ్‌గా గుర్తించారు. వైసీపీ ముఖ్య నేత తన అనుచరులతో కొద్దినెలల క్రితం ఈ భూములను కొనుగోలు చేయించినట్లు ఆరోపణలున్నాయి.ఆయనకు సన్నిహితంగా మెలిగిన అనుచరుడు ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.వాటిలో ఒకటి డీకేటీ భూముల స్కాం. మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌ను అధికారులు పక్కన పెట్టారు. ఐదు రోజుల క్రితం పోలింగ్ ముగియడంతో వైసీపీ ముఖ్యనేత చాపకింద నీరులా డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ పనులను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. శుక్రవారం రెవెన్యూ అధికారులను పిలిపించి ఆయా మండలాల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో వుంటుందని, అప్పటిదాకా రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వలేమంటూ కొందరు అధికారులు చేతులెత్తేసినట్లు తెలిసింది.అయితే ఎలాగైనా చేయాలంటూ ఆయన ఒత్తిడి చేస్తుండడంతో విషయం బయటకు పొక్కింది.

తగ్గిపోయిన నిమ్మ ధరలు



గూడూరు అర్బన్, మే 17: గూడూరు మార్కెట్‌లో శుక్రవారం నిమ్మకాయల ధరలు తగ్గిపోయాయి. నాలుగురోజుల క్రితం కిలో రూ.80 నుంచి రూ.130 వరకు పలికిన నిమ్మకాయలు శుక్రవారం రూ. 30 నుంచి రూ.90 మాత్రమే పలికాయి.ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలతో నిమ్మధరలు శుక్రవారం పడిపోగా టిక్కీ బస్తా రూ.1500కు, లూజుబస్తా రూ.7,200కు వ్యాపారులు కొనుగోలు చేశారు.పెరిగిన ధరలు పదిరోజులు కూడా వుండకపోవడంతో నిమ్మ రైతులు నిరాశపడ్డారు.

విమానమెక్కిన విద్యార్థులు



చెన్నై ఎయిర్‌పోర్టులో విద్యార్థులు

సత్యవేడు, మే 17: సత్యవేడు మండలం మాధనపాళెం జడ్పీ హైస్కూల్లో ఇటీవల టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులకు విమానమెక్కే అవకాశం కలిగింది. పదవ తరగతిలో 500పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను విమానంలో విహారయాత్రకు తన ఖర్చులతో పంపుతానని గ్రామానికి చెందిన ఉమాపతి గతంలో ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం మాధనపాళెం ఉన్నత పాఠశాలలో ఈసారి టెన్త్ పరీక్షలు రాసి ఐదు వందల కంటే ఎక్కువ మార్కులు సాధించిన పురుషోత్తం(552), వి.విష్ణు(515), మహా(509), తనూజ(505)తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడుముని మోహన్‌ను చెన్నై నుంచి విమానంలో శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.వీరంతా రెండు రోజుల పాటు వివిధ ప్రాంతాలను సందర్శించాక తిరిగి సొంతూరుకు చేరుకోనున్నారు.

ఒంటరి ఏనుగు జాడ గుర్తింపు

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలం ఆముదాల కోన ఎస్టీ కాలనీ పీతల చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు జాడను శుక్రవారం అటవీ అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా పనపాకం డిప్యూటీ రేంజి అధికారి చినబాబు ఆధ్వర్యంలో ఏనుగు జాడ కోసం గాలిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఏనుగు పాదముద్రలు, వ్యర్థాలు కనిపించాయి. దీంతో ఎస్టీ కాలనీతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు, అటవీ ప్రాంతంలోకి వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఒంటరి ఏనుగు ఈనెల 12న చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం వెంగంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్యపై దాడి చేసి చంపేసింది. అక్కడి నుంచి పూతలపట్టు మండలం మీదుగా పాకాల మండల సరిహద్దుల్లోకి చొరబడి 13న చెన్నుగారిపల్లె పంచాయతీ సమీపంలో తమిళనాడుకు చెందిన కాతవరాయన్‌పై దాడి చేసి హతమార్చింది.తాజాగా ఆ ఏనుగు తమ ప్రాంతంలో సంచరిస్తోందని తెలిసి ఆముదాల కోన ఎస్టీ కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జాడ తెలిసినందున ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ప్రయత్నిస్తున్నామని అటవీ సిబ్బంది తెలిపారు.

● ఆముదాలకోన ఎస్టీ కాలనీ వద్ద గజరాజు పాదముద్రలు



ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

● మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలును పరిశీలించిన కలెక్టర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ భద్రత పటిష్ఠంగా ఉందన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు నిత్యం బందోబస్తు నిర్వహిస్తున్నారని వివరించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ భద్రతతోపాటు కౌంటింగ్ ప్రక్రియ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, నరసింహులు, ఏఎస్పీ కులశేఖర్, డీఆర్వో పెంచలకిషోర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భద్రత కఠినతరం చేయండి: ముఖేష్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్): పోలింగ్, తర్వాత జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్‌గుప్తాతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. అధికారులు స్ట్రాంగ్ రూమ్ పరిశీలించాక సందర్శకుల రిజిస్టర్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికపుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫేక్ న్యూస్‌ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ఈసీ నియమిత సిట్‌లో ఏసీబీ డీఎస్పీకి చోటు



రవిమనోహరాచారి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లో తిరుపతి ఏసీబీ డీఎస్పీ కె.రవిమనోహరాచారికి చోటు దక్కింది. ఎస్‌ఐగా, సీఐగా, డీఎస్పీగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం ఈయన పనిచేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్ వంటి మూడు కీలక విభాగాల్లో విధులు నిర్వర్తించిన ఈయనకు ఈ ప్రాంతంపై సమగ్రమైన అవగాహన, ఇక్కడి పరిస్థితులను అంచనా వేయడంలో అవగాహన వున్నాయి. అనేక సంచలనాత్మక కేసులను పరిష్కరించి సమర్థుడైన అధికారిగా గుర్తింపు పొందారు. తాజాగా ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత తిరుపతి, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయడం వంటివి సిట్‌కు ఈసీ అప్పగించిన బాధ్యతలు. సిట్‌లో మొత్తం 13మంది సభ్యులుండగా అందులో రాయలసీమ నుంచీ ఎంపికైన ఇద్దరు అధికారుల్లో రవిమనోహరాచారి ఒకరు. ఈసీ ద్వారా ప్రత్యేక దర్యాప్తు బృందంలో నియమితులు కావడం ఆయన సమర్థతకు, అనుభవానికి దక్కిన గుర్తింపుగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

తరగతి గదుల నిర్మాణానికి ఆర్థికసాయం



కళాశాల తరగతి గదుల నిర్మాణ పనులు

భాకరాపేట, మే 17: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.2 కోట్లతో తరగతి గదులు నిర్మిస్తున్నట్లు దాత, పారిశ్రామికవేత్త వలసారెడ్డి శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. 1984లో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. అప్పటి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలలోనే కళాశాల తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఆ గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు రేకులు వేయించామని శివప్రసాద్ రెడ్డి శుక్రవారం చెప్పారు. శాశ్వత భవనాలు నిర్మిస్తే ఈ ప్రాంత విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని భావించామన్నారు. తన తండ్రి, జెడ్పీ మాజీ చైర్మన్ వలసారెడ్డి సిద్దరామిరెడ్డి పేరు మీదుగా కళాశాలకు ఏడు తరగతి గదులు, ఆరు ల్యాబ్ గదుల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. మరో రెండు నెలలో గదుల నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉందని వివరించారు.

రేపటివరకూ రైల్వే గేట్ మూసివేత



రైల్వే గేట్ రిపేరు చేస్తున్న దృశ్యం

తిరుపతి(సెంట్రల్)మే17: తిరుపతి-రేణిగుంట రైలు మార్గంలో 109 ఎన్‌సీ గేటు(పద్మావతి ఫ్లోర్ మిల్లు గేటు)ను అధికారులు ముందస్తు సమాచారం లేకుండా గురువారం మూసివేయడంతో శెట్టిపల్లి గ్రామ ప్రజలు, సీఆర్ఎస్ కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాల్సి వుంది. గేటు మూసివేయడంతో తిరుపతికి మంగళం మార్గంలో వెళ్ళాలి. లేనిపక్షంలో సీఆర్ఎస్ ఆసుపత్రి మీదుగా మెయిన్ రోడ్డుకు రావాలి. మరమ్మతులు చేస్తున్న కారణంగా సీఆర్ఎస్ ఉద్యోగులతో పాటు స్థానికులకూ ఇబ్బంది తప్పడంలేదు. ఈ విషయమై రైల్వే అధికారులను వివరణ కోరగా రైల్వే గేటు వద్ద పట్టాలకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం వరకు గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారి సేవలో ఎంపీ రఘురామకృష్ణరాజు



తిరుచానూరు, మే 17: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఎంపీ రఘురామ కృష్ణరాజు శుక్రవారం దర్శించుకున్నారు. ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారిమూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీ రఘురామకృష్ణంరాజుతో పాటు టీడీపీ నేత శ్రీధర్‌వర్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు సీసీ కెమెరాల విరాళం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి, దాత మధు

తిరుచానూరు, మే 17: పద్మావతిపురం జడ్పీ హైస్కూల్‌కు ప్రధానోపాధ్యాయుడు ఎస్.మధు రూ.60వేలు విలువ చేసే సీసీ కెమెరాలను విరాళంగా అందజేశారు. మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి, డీఈవో శేఖర్ శుక్రవారం వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రధానోపాధ్యాయుడు మధును అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

పాకాల, మే 17: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. స్కానింగ్, వీర్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. అలాగే చెన్నై శంకర్ నేత్రాలయ వైద్య బృందం నేతృత్వంలో ఉచితంగా కంటి వైద్య శిబిరం కూడా నిర్వహిస్తామన్నారు. అవసరమైనవారికి కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి సమస్యలున్నవారు ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలం మిట్టపాలెం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు కాలనీకి చెందిన వెంకటేష్(65) కుటుంబంలో మనస్పర్థల నేపథ్యంలో శుక్రవారం ఉదయం పురుగులు మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న ఇతడ్ని కుమారుడు నారాయణ చూసి హుటాహుటిన 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ సాయంత్రం వెంకటేష్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐకేఎస్‌తో వేదవర్సిటీ ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను చూపుతున్న రాణీసదాశివమూర్తి, సూర్యనారాయణమూర్తి

తిరుపతి రూరల్, మే 17: వైదిక సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న వైజ్ఞానిక విశేషాలను వెలికి తీసి సమాజానికి అందించేందుకు తిరుపతిలోని ఎస్వీ వేద వర్సిటీతో భారతప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖకి చెందిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) ఎంవోయూ కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, ఐకేఎస్ జాతీయ కోఆర్డినేటర్ జి.సూర్యనారాయణమూర్తి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐకేఎస్ కథనాలు రాయడం, పురాతన వేదగ్రంథాల ప్రామాణికమైన అనువాదాలను అన్ని భారతీయ భాషల్లోకి తీసుకురావడం ద్వారా కంటెంట్ అభివృద్ధి, మాన్యుస్క్రిప్ట్ డిజిటలైజేషన్, పురాతన పురాణాల నుంచి శాస్త్రీయ కంటెంట్‌తో సామాజిక ఔచిత్యంగల గ్రంథాలను గుర్తించడం, వాటిని సవరించడం, ప్రచురించడం, వేదమూలాలపై సెమినార్లు, వర్క్‌షాప్స్, కాన్ఫరెన్స్‌లు, వివిధ ఆచారాల ఆడియో-విజువల్ రికార్డులను రూపొందించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని వీసీ వివరించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, డీన్ గోలిసుబ్రహ్మణ్యశర్మ, రాధేశ్యామ్, ఎంవీఎన్ పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణస్వామి రాజు కథలకు పురస్కారం



తిరుపతి(కల్చరల్), మే 17: తిరుపతికి చెందిన ప్రముఖ కథకుడు ఆర్‌సీ కృష్ణస్వామి రాజు ఇటీవల ప్రచురించిన కార్వేటినగరం కథల సంకలనానికి పలమనేరు శివేగారి దేవమ్మ బాలల కథాపురస్కారం లభించింది. బాల సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి ఏటా పురస్కారాలు అందజేస్తున్నట్లు నిర్వాహకుడు కేవీ మేఘనాథరెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. కృష్ణస్వామి రాజు ఇప్పటి వరకు 150 పిల్లల కథలు రచించారని, అనేక కథలు ఆకాశవాణిలో ప్రసారమయ్యాయని పేర్కొన్నారు.

కోణంగివారిపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలం కోణంగివారిపల్లె వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుని వయసు సుమారు 45 సంవత్సరాలుంటుంది. ప్యాంట్, బనియన్ వేసుకున్నాడని, మృతదేహం ఉబ్బిపోయి ఉందని పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం

తిరుపతి రూరల్ మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల వినతి



మాట్లాడుతున్న ఎంపీపీ యశోద, జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి తదితరులు

తిరుపతిరూరల్,మే17: గ్రామాల్లో తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. తిరుపతి రూరల్ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యశోద అధ్యక్షతన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్‌లు డీవీ రమణ, మొక్కల భారతి తదితరులు మాట్లాడుతూ బోర్లు ఎండిపోయిన నేపథ్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. బోరు బావుల లోతు తవ్వించాలని, లేనిపక్షంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. తిరుచానూరు పార్కు సమీపంలోని కాలువ వల్ల దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీపీ యశోద స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాలను సందర్శించి నీటిసమస్యపై నివేదించాలన్నారు. జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్‌ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీవో రమేష్ బాబు, ఏవో పిచ్చిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో వ్యాను బోల్తా

అదుపుతప్పి కొండను ఢీకొన్న కారు
12 మందికి స్వల్పగాయాలు





మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన వ్యాన్ - కొండను ఢీకొన్న కారు - అదుపుతప్పి రోడ్డుకు అడ్డుగా నిలబడిన టీటీడీ వాటర్ ట్యాంకర్

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. చెన్నైకి చెందిన 12 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఎనిమిది మంది భక్త బృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఓ వ్యానులో శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. అలిపిరికి సమీపంలో మాల్వాడిగుండం వద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. అదృష్టవశాత్తూ వాహనంలోని వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో వెనుకవస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ కూడా ఒక్కసారిగా అదుపుకోల్పోయింది. సడన్ బ్రేక్ వేయడంతో వాహనం జారి.. రోడ్డుగా అడ్డుగా నిలబడింది. అలాగే 19వ మలుపు వద్ద కూడా ఓ కారు కూడా అదుపుతప్పి కుడివైపునున్న కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోనూ చెన్నైకి చెందిన నలుగురు భక్తులు స్వల్పగాయాలో బయటపడ్డారు. వర్షం పడటంతోనే ఈప్రమాదాలు చోటుచేసుకున్నట్టు భక్తులు తెలిపారు.

చిన్నశేష, హంస వాహనాలపై గోవిందుడి విహారం





చిన్నశేష, హంసవాహనాలపై స్వామివారు - కళాబృందాల ప్రదర్శన

తిరుపతి(కల్చరల్) మే 17: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు చిన్నశేష వాహనంపై స్వామివారు మాడవీధుల్లో విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి ఏడు గంటలకు హంస వాహన సేవ నిర్వహించారు. హంసవాహనంపై సరస్వతి రూపంలో కొలువైన గోవిందుడు కనువిందుచేశాడు. ఈ సందర్భంగా నాలుగు మాడవీధుల్లో భక్తులు స్వామివారికి అడుగడుగునా కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జీయరు స్వాములు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, ఇతర అధికారులు, పండితులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహనసేవలు జరుగుతాయి.

ఉచిత భోజనాన్నీ సరఫరా చేయలేరా?

- పేదల కోసం ఆహారం అందజేస్తున్న ముక్కంటి ఆలయం
- దాన్ని ఆస్పత్రికి చేర్చేందుకు నిధులు లేవట
- రోజుకు రూ.200 వెచ్చించలేక ఆగిన సరఫరా
- పేదలకు తప్పని పస్తులు



శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో పేదలకు ఆకలి కేకలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ప్రజా అవసరాలు తమకేమీ పట్టనట్లు పాలకులు, అధికారులు గాలికి వదిలేశారని నిత్యం విమర్శలు వెలువెత్తుతూనే ఉన్నాయి. ముక్కంటి ఆలయం నుంచి ప్రతిరోజూ ఉచితంగా వచ్చే భోజనాన్ని కూడా పంపిణీ చేయకుండా కేవలం ఆటో అద్దె చెల్లించలేమని సాకు చూపుతూ మంగళం పాడేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కాంట్రాక్టు ద్వారా మూడు పూట్ల నిర్ధిష్టమైన పరిమాణంలో ఆహారం అందజేస్తుంటారు. అయితే ఇది కేవలం అడ్మిషన్‌లో ఉన్న రోగులకు మాత్రమే సరఫరా చేస్తారు. అడ్మిషన్‌లో ఉన్న రోగులతో పాటు వారి సంబంధీకులు ఆస్పత్రిలో పెద్ద ఎత్తున నిరీక్షిస్తుంటారు. ఇక మధ్యాహ్నం ఓపీ సమయంలో వందలాది మంది రోగులు, వారి సంబంధీకులు ఆస్పత్రికి వస్తుంటారు. మధ్యాహ్న భోజనం అవసరమైన వారంతా ఆర్టీసీ కూడలికి వెళ్లక తప్పదు. ఈ సమస్యను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసింది. ఆస్పత్రికి వచ్చేవారంతా రూ.5కే నాణమైన భోజనం అందుబాటులో ఉండడంతో పెద్దఎత్తున ప్రజలు ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నా క్యాంటీన్ మూత పడిన విషయం తెలిసిందే. ఇక మళ్లీ ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనం కోసం ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటినుంచి పలువురు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆస్పత్రిలో ఉచిత భోజనం అమలు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. పలుమార్లు ముక్కంటి ఆలయ అధికారులకు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో గత యేడాది అక్టోబరులో ముక్కంటి ఆలయ నిత్యాన్నదానం నుంచి ఉచితంగా ఆస్పత్రికి భోజనం సరఫరా చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం ప్రతి రోజూ మధ్యాహ్నం సుమారు 150 మందికి ఆలయం నుంచి భోజనం సరఫరా చేశారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ యేడాది మార్చి 1 నుంచి ఆస్పత్రిలో ఉచిత భోజనం పంపిణీ ఆగిపోయింది. ఆలయం నుంచి ఉచితంగా భోజనం ఇచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ ప్రతిరోజూ భోజనం ఆస్పత్రికి చేరేందుకు, తిరిగి పాత్రలు ఆలయానికి చేరేందుకు రూ.200 ఆటో బాడుగ అవుతుంది. ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిధుల నుంచి వెచ్చించలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. ఆస్పత్రిలో మెయింటెనెన్స్ నిధులు వెచ్చించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఉచిత భోజనానికి మంగళం పాడేశారు. రూ.12కోట్ల నిధులతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేశామని నిత్యం పాలకులు, అధికారులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆటో బాడుగ కట్టలేమంటూ నిరుపేదల కడుపు కాలుస్తున్నారు. ఈ సమస్య తెలుసుకున్న కొందరు దాతలు ఇటీవల తాము ఆటో అద్దె చెల్లిస్తామంటూ ముందుకు వచ్చారు. కానీ ఆస్పత్రి అధికారుల్లో కనికరం కలగలేదు. ఏదో కారణంతో పేదలకు అన్నాన్ని దూరం చేస్తూనే ఉన్నారు. ఈ నిర్లక్ష్యపు చర్యతో ప్రభుత్వాస్పత్రిలో ప్రతిరోజూ మధ్యాహ్నం పేదలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయం నుంచి వచ్చే నోటి కాడ కూడును లాగొద్దు అంటూ రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చంద్రగిరిలో భారీ వర్షం



చంద్రగిరిలో..

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. చంద్రగిరిలో రోడ్లు జలమయమయ్యాయి. కాలువలు పొంగి పొర్లాయి. పరిసర గ్రామాల్లో కూడా వర్షం కురిసింది. గాలులకు మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి.

రామచంద్రాపురం: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. హోరుగాలి వీయడంతో మామిడికాయలు నేలరాలాయి. కోతకు వచ్చిన వరిపంట నేలకొరిగింది. చాలా రోజుల తరువాత చిన్నపాటి కాలువలు ప్రవహించాయి. చెరకు తోటలకు ఈ వర్షం వల్ల కొంత లాభం చేకూరింది.

ఎన్నికల హింసపై ఈసీ సీరియస్

తిరుపతికి అదనంగా 4 కంపెనీల కేంద్ర బలగాలు

తిరుపతి(నేరవిభాగం), మే 17 : కేంద్ర ఎన్నికల కమిషన్ హెచ్చరికలతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ అనంతరం హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం, ఏకంగా టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ శ్రేణులు మారణాయుధాలతో దాడులకు దిగడంపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది.ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్‌పై బదిలీ వేటు వేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలను సస్పెండ్ చేసిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగంలో అంతర్మథనం జరుగుతోంది. ఇంకెంతమందిపై ఎన్నికల కమిషన్ చర్య తీసుకుంటుందోననే చర్చ సాగుతోంది.మరోవైపు చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతీకార దాడులు జరిగే అవకాశాలున్న గ్రామాలను గుర్తించి అక్కడ కేంద్ర బలగాలను నియమించేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు చర్యలు తీసుకుంటున్నాయి.యుద్ధప్రాతిపదికన సమస్యాత్మక గ్రామాల వివరాలను స్టేషన్ల వారీగా పంపాలని ఏఎస్పీ కులశేఖర్ ఆదేశాలు జారీ చేశారు.రౌడీషీటర్లను కౌంటింగ్‌కు రెండు రోజుల ముందే అదుపులోకి తీసుకునే ఆలోచనలో అధికారులున్నారు.ఘర్షణలు, ప్రతీకార దాడులు జరిగే అవకాశమున్న 25 గ్రామాల్లో కేంద్ర బలగాలను నియమించడానికి వీలుగా దాదాపు 4 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలు తిరుపతికి వస్తున్నాయి.కేంద్ర ఎన్నికల కమీషన్ ఏర్పాటుచేసిన సిట్ బృందం కూడా శుక్రవారం రాత్రికి కానీ, శనివారం కానీ తిరుపతికి రానుంది.ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులను క్షుణ్ణంగా పరిశీలించనుంది.ఎక్కడైనా పోలీసులు పక్షపాతంగా వ్యవహరించారా అన్న విషయమై దర్యాప్తు చేయనుంది.

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం



మృతదేహాలకు దహన క్రియలు చేస్తున్న తండ్రి బాబు

వడమాలపేట, మే 17: ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి చెందడంతో ఎస్‌బీఆర్ పురం శోకసంద్రంలో మునిగిపోయింది. వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు రూపిక(10), చరిత(13), యూషిక గురువారం దిగువ గూళూరు గూళూరు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాలను తీసుకువచ్చారు. చిన్నారుల మృతదేహాలను చూసిన బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి బాబు తన కుమార్తెల మృతదేహాలకు దహన క్రియలు నిర్వహించారు.

డిన్నర్‌కు వచ్చి మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తమిళనాడు యువకుల మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- తడుకుపేట వద్ద ఘటన




రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులు



కన్నన్, ఇళంగోవన్ (ఫైల్ ఫొటో)

నగరి, మే17: స్నేహితుడి ఇంటికి డిన్నర్ కోసం వచ్చి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తమిళనాడు యువకులు మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని తడుకుపేట జగనన్న హౌసింగ్ కాలనీ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు కన్యాకుమారి జిల్లా రామనాథపురానికి చెందిన కన్నన్(28), ఇళంగోవన్(26), నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడకు చెందిన సంజయ్(29) చెన్నై తాంబరంలోని రెడిమేడ్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్నారు. సంజయ్ ఇంట్లో డిన్నర్ ఉండడంతో వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురూ వెళుతుండగా తడుకుపేట జగనన్న హౌసింగ్‌కాలనీ వద్ద ఆగి ఉన్న వ్యానును వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కన్నన్, ఇళంగోవన్ అక్కడికక్కడే మృతిచెందారు. సంజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు విరిగిపోవడంతో చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తి చేసి, శుక్రవారం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

లారీ-బైక్ ఢీ : విద్యార్థి మృతి



సురేష్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, మే 17: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం పాతపేటకు చెందిన మురుగేష్ కుమారుడు సురేష్ సొంత పనుల నిమిత్తం బైక్‌లో బంగారుపాళ్యంకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా మొగిలి ఘాట్‌లో మరమ్మతులకు గురై ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సురేష్ (21) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పలమనేరులోని ఒక ప్రైవేటు కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతున్నాడు. సురేష్ మృతిపట్ల తోటి విద్యార్థులు, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పాకాల, మే 17: చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై పాకాల మండలం గాదంకి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాదంకికి చెందిన రామమూర్తి (50) రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీ కొంది. రామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును టోల్‌గేటు వద్ద గుర్తించి పట్టుకున్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల,మే17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీదేవిశుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. జస్టిస్ శ్రీదేవిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుపతి

ఆకట్టుకున్న కళారూపాలు

అమ్మవారి ఆలయం వద్ద వివిధ కళారూపాల ప్రదర్శన జరిగింది. తప్పెటగుళ్లతోపాటు కేరళ సంప్రదాయంలో ప్రదర్శించిన వాద్యసంగీతం అలరించింది. సీతారాముల వేషంలోని చిన్నారులు ఆకట్టుకున్నారు. వివిధ దుర్గామాత రూపాలను ధరించిన కళాకారులు దుష్టసంహారం చేసే దృశ్యాలు గగుర్పాటు కలిగించాయి. వెలుగుతున్న కర్పూరం మింగడం, నాలుకకు శూలాలు గుచ్చుకుని తమ కళానైపుణ్యం ప్రదర్శించారు. అలాగే డోలు, పిల్లనగ్రోవి, పంబల వంటి సనాతనమైన సంగీత వాయిద్యాలతో అలరించారు.

నేటి వేషాలు : జాతరలో భాగంగా శనివారం భక్తులు దొరవేషంలో అమ్మవారిని సేవిస్తారు.













కోమటి, తోటి వేషాలతో

భక్తుల సందడి

తిరుపతి(కల్చరల్), మే 17: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం కోమటి, తోటి వేషాలతో అమ్మవారిని భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. కోమటి వేషం సందర్భంగా ఉదయం మిరాశి వంశస్తులైన కైకాల వారు మహిళ వేషం, చాకలి వంశస్తులు మగవేషం వేశారు. సాయంత్రం వేసే తోటి వేషాన్ని పురజనులు అందరూ వేయడం ఆనవాయితీ. మిరాశీదారులువేసే తోటి వేషంలో వాడే గంప, చేట, శేషవస్త్రాలను తిరుమల నుంచి శ్రీవారు తన చెల్లెలు గంగమ్మకు కానుకగా పంపారు. తిరుమల నుంచి గోవిందరాజ స్వామి ఆలయానికి చేరుకున్న వీటిని కైకాల వంశస్తులు తీసుకుని, వారి ఇంటి నుంచి ఊరేగింపుగా పురవీధుల్లో తిరిగారు. చాటతో భక్తులను ఆశీర్వదిస్తూ.. గంగమ్మ ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. శుక్రవారం చిరుజల్లుల కారణంగా వాతావరణం చల్లబడడంతో భక్తులు ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నగరంలో వివిధ కూడళ్లవద్ద ఏర్పాటు చేసిన గంగమ్మ విగ్రహాల వద్ద కూడా ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలను నిర్వహించారు. సాయంత్రం 7.30 గంటలకు ఇందిరా మైదానంలో ఎం.శ్యామ్‌సాయి నిర్వహణలో బలిజేపల్లి లక్ష్మీకాంత కవి విరచిత సత్యహరిశ్చంద్రీయము నాటకం ప్రదర్శించారు.



వేశాలమ్మకు సారెను తీసుకెళుతున్న యూనివర్సల్ క్యాటరింగ్ అధినేతలు పద్మనాభం, ప్రేమ్ కుమార్, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు



వేశాలమ్మ



కోమటి వేషంలో చాకలి, కైకాల వంశస్తులు



చాటతో భక్తులకు ఆశీర్వాదం (ఇన్‌సెట్లో) శ్రీవారు పంపిన చాట, గంప



తాళ్లపాక పెద్ద గంగమ్మకు సారె తీసుకెళుతున్న 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికా రెడ్డి తదితరులు

ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

- ఆరణి శ్రీనివాసులుకు 20వేల నుంచి 30వేల మెజారిటీ
- భూమన, చెవిరెడ్డి తిరుపతి పవిత్రతను దెబ్బతీశారు
- టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో సుగుణమ్మ



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఖాయమని, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం ఓ హోటల్లో పార్టీ శ్రేణులతో ఆమె విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియలో కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశంతో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం టీడీపీ కేడర్ మొత్తం ఎంతో శ్రమించిందన్నారు. అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనకడుగు వేయలేదన్నారు. తిరుపతిలో 62.3 శాతం ఓట్లు పోలయ్యాయని, ఎస్వీ జాబితాలోని 54వేల ఓట్లను తీసేస్తే పోలింగ్ శాతం 70పైగా పెరిగిందని అర్థం చేసుకోవచ్చన్నారు. 20వేల నుంచి 30వేల మెజారిటీతో ఆరణి శ్రీనివాసులు గెలవబోతున్నారని స్పష్టం చేశారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి కూడా భారీ మెజారిటీతో గెలుస్తారని చెప్పారు. తిరుపతి, చంద్రగిరిలో వైసీపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు అరాచకంగా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. దొంగ ఓట్లకోసం విస్తృతంగా ప్రయత్నించారన్నారు. అయినా ఓటమి తప్పదని తెలిసి దాడులకు తెగబడుతున్నారన్నారు. కరుణాకరరెడ్డి, చెవిరెడ్డిలు తిరుపతి ప్రశాంతతను దెబ్బతీశారని మండిపడ్డారు. ఎపిక్ కార్డుల కుంభకోణంలో 22మంది అధికారులపై వేటు పడినప్పటికీ కొందరిలో తీరు మార్చుకోలేదని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా కొందరు వైసీపీ తొత్తులుగా మారడంతో వారిపై కూడా వేటు పడే పరిస్థితులు వచ్చాయన్నారు. ఎన్నికల ముందు పాత్రికేయులను వెధవ, అంతుచూస్తాం వంటి మాటలు మాట్లాడితే ఎవరైనా ఓట్లు వేస్తారా? టీటీడీ చైర్మన్‌గా ఇలాంటి భాష మాట్లాడతారా? అంటూ ఆగ్రహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంపూరి భాస్కర్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, మన్నెం శ్రీనివాసులు నాయుడు, బుల్లెట్ రమణ, ఇనుగొండ సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, కుమారమ్మ, సింధూజ, చినబాబు, సుధాకర్ రెడ్డి, రుద్రకోటి సదాశివం, అన్నా రామకృష్ణ, కొట్టే హేమంత్ రాయల్, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



తిరుపతి అర్బన్, మే 17: తిరుపతి మహానగర ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అధ్యక్షుడిగా పామిడి సత్యనారాయణ శెట్టి, కార్యదర్శిగా కొండూరు మహేష్, కోశాధికారిగా శిరీష, ఉపాధ్యక్షులుగా కోటా రవిచంద్రశేఖర్, జి.కె.రాణి, ద్రాక్ష సుబ్రహ్మణ్యం, సాయి, సురేష్, రామమూర్తి, శ్యామ్‌సుందర్, రాజేష్, రాజ్‌కుమార్, శ్రీనివాసులు, రాజేంద్ర అమ్మవారి ముందు ప్రమాణం చేసి బాధ్యతలను చేపట్టారు. ఈ కమిటీ ఐదేళ్లపాటు కొనసాగనుంది.





నగరంలో వాన

తిరుపతి అర్బన్, మే 17: తిరుపతిలో శుక్రవారం మధ్యాహ్నం దాదాపు అరగంటపాటు ఓ మోస్తరు వాన, సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో వ్యాపారులు, బస్టాండులో ప్రయాణికులు కాస్త ఇబ్బందిపడ్డారు. సాయంత్రానికి వాతావరణం చల్లబడటంతో స్థానికులు కొంత ఉపశమనం పొందారు. గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 76,369 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,927 మంది తలనీలాలు సమర్పించారు.

డాక్టరేట్ ప్రదానం



చంద్రప్ప

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17: ఎస్వీయూ ఫిజిక్స్ పరిశోధకుడు వి.చంద్రప్ప డాక్టరేట్ పొందారు. కాంపోజిషన్ డిపెండెంట్ వైట్‌లైట్ ఎమిషన్ స్టడీస్ ఆఫ్ డివై3+ - డోప్డ్ ఆక్సైడ్ అండ్ ఆక్సీఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ లైటింగ్ అప్లికేషన్స్ అంశంపై ప్రొఫెసర్ సీకే జయశంకర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు: డీఎంహెచ్‌వో

తిరుపతి(వైద్యం), మే 17: రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం తప్పదని డీఎంహెచ్‌వో శ్రీహరి హెచ్చరించారు. ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా రుయా సూపరింటెండెంట్ రవిప్రభుతో కలిసి శుక్రవారం ఆస్పత్రిలో రక్తపోటుపై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. శారీరక వ్యాయామం, తగిన జాగ్రత్తలు తీసుకుంటే రక్తపోటు తో వచ్చే గుండెపోటు అదుపులో ఉంటుందన్నారు. వైద్యాధికారులు సుబ్బారావు, హరికృష్ణ, శ్రీనివాసులు, లావణ్య, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

ఎన్నికల్లో హింసకు వైసీపీనే కారణం

- విర్రవీగిన నేతల కథ 'కూటమి' గెలిచాక తేలుస్తాం
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17: ఎన్నికల్లో హింసకు వైసీపీనే కారణమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు ఇలా చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంపై కనీస గౌరవం లేకుండా వైసీపీ నాయకుల తీరు కనిపిస్తోందని చెప్పారు. ఎన్నికలకు ముందు, తర్వాత కూడా అరాచకానికి పాల్పడుతున్నారని విమర్శించారు.ఎన్డీఏ కూటమి గెలిచాక ఇప్పటి వరకు విర్రవీగిన వైసీపీ నేతల కథ తేలుస్తామని హెచ్చరించారు. పల్నాడు, తాడిపత్రి, చంద్రగిరి ఘటనలకు పోలీసుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్నారు. ఈ విషయంలో పోలీసులపై కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలే నిదర్శనమని అభిప్రాయపడ్డారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, ఆయన గన్‌మేన్‌పై దాడి జరగడం దారుణమన్నారు. వైసీపీ నాయకుల ఇళ్లలో నాటు, పెట్రోల్ బాంబులు, రాళ్లు, సుత్తులు ఉన్నాయంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. వైసీపీ పాలనతో అరాచక ప్రదేశ్‌లా రాష్ట్రం అనిపిస్తూ ఉందని అభిప్రాయపడ్డారు. అందువల్ల సీఎం జగన్ యూకే పర్యటనకు కాకుండా యూపీ వెళ్లి అక్కడ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చట్టాలను ఎంత పటిష్ఠంగా అమలు చేస్తోందో తెలుసుకోవాలని హితవు పలికారు. వైసీపీ ప్యాకప్ అని ఐప్యాక్ వాళ్లు లోపల చెబితే, బయటికి వచ్చి రాష్ట్రంలో మళ్లీ అధికారం తమదే అని సీఎం ఆర్భాటాలు పలుకుతున్నారని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిదే అధికారమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జిల్లా కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ బాల భాస్కర్, జిల్లా కార్యదర్శి మల్లకుప్పం శేఖర్, తిరుపతి అసెంబ్లీ కో-కన్వీనర్ నాదముని, మీడియా ఇన్‌చార్జి దయానంద్ పాల్గొన్నారు.



రాళ్లు, సుత్తి చూపుతూ మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

నగదు వసూళ్లకు పాల్పడిన వారికి మెమో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), మే 17: మరణానికి కారణం తెలిపే ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు కూడా బాధితుల నుంచి నగదు తీసుకున్న డాక్టరుకి, సహకరించిన సిబ్బందికి సూపరింటెండెంట్ రవిప్రభు మెమో జారీ చేశారు. నాయుడుపేటకు చెందిన జయమ్మ అనే మహిళ ఆస్పత్రిలో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు తన తల్లి మరణానికి కారణం తెలిపుతూ డాక్టర్లు ఇచ్చే కాజ్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ కోసం నెల రోజులుగా తిరుగుతున్నా ఇవ్వలేదు. చివరకు ఈనెల8న బాధితుడి నుంచి రూ.500 తీసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. దీనిపై ఈనెల 10న 'చావుకు కారణం తెలియజేయాలన్నా డబ్బివ్వాల్సిందే' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ విచారణ చేపట్టారు. జనరల్ మెడిసిన్ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్రమణ.. కాజ్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు బాధితుడిని రూ.500 అడిగారని, ఈనగదును గంగాధర్ అనే సిబ్బంది బాధితుడి నుంచి తీసుకుని ఫోన్‌పే ద్వారా డాక్టరుకి పంపించినట్లు అధికారుల విచారణలో తేలింది. దాంతో వీరికి మెమో జారీ చేశారు.

డాక్టరుని తప్పించే పనిలో..?

ఈ ఘటనలో డాక్టరుని తప్పించే పనిలో పలువురు వైద్య విభాగాధిపతులు ఉన్నట్లు సమాచారం. ఇదే డాక్టరు గతంలోనూ వైద్యం కోసం వచ్చిన ఓ మహిళ నుంచి రూ.1,500 తీసుకున్న విషయంపై అధికారులకు ఫిర్యాదు కూడా అందింది. అప్పుడు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయకపోతే నిరుపేదలు నిత్యం ఆర్థిక దోపిడీకి గురయ్యే అవకాశాలున్నాయి.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, వైసీపీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

చినుకు పడితే చిత్తడే

- తీవ్ర ఇబ్బంది పడుతున్న బాలాజీనగర్‌వాసులు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చాలు తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీనగర్ చిత్తడైపోతోంది. వర్షపు నీటితో కలిసిన మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పరిసరాలన్నీ దుర్గంధంతో నిండిపోతున్నాయి. బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాలు పైభాగం నుంచి మురుగు కొద్దిరోజులుగా పొంగి, రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షం పడితే ఇంకా అధికమవుతోంది. ఈసమస్యపై స్థానికులు ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇళ్ల ముందు ప్రవహిస్తున్న మురుగు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్/ వెంకటగిరి టౌన్/ కోట, మే 17: గూడూరు పట్టణంలోని అడవయ్యకాలనీ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. వెంకటగిరి పట్టణంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ ముని రవిచంద్ర శుక్రవారం తెలిపారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు. కోట మండలం చెందోడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కోట, వాకాడు మండలాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పూర్తిగా సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

పడవల రేవా... మందుబాబుల అడ్డానా?


పడవల రేవు వద్ద పడి ఉన్న మద్యం సీసాలు

తడ, మే 17: ఆ ప్రదేశం చూసేందుకు ఎంతో అందంగా ఉంటుంది. ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. అటువంటి ప్రదేశం ఇప్పుడు మందుబాబులకు అడ్డాగా మారిందా... అంటే ఔననే సమాధానం వస్తుంది. అదే భీములవారిపాళెం పడవ రేవు. పులికాట్ సరస్సు ఒడ్డునే ఉండే ఈ రేవు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తుంది. అయితే ప్రస్తుతం ఆ ప్రదేశం మందుబాబులకు అడ్డాగా మారింది. ఎక్కడ చూసినా ఖాళీ మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. రేవును శుభ్రపరచి ఆహ్లాదకరంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మండలంలో గరిష్ఠం... పట్టణంలో కనిష్ఠం

గూడూరు అర్బన్, మే 17: సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గంలోని మండలాల్లో విభిన్న పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గ పరిధిలో గూడూరు పట్టణంతోపాటు గూడూరు మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలున్నాయి. నియోజకవర్గంలో 2,45,205 ఓట్లు ఉన్నాయి. ఇందులో గూడూరు మండలంలో 23,543 ఓట్లు ఉండగా 20,875 ఓట్లు పోల్‌కాగా 88.67శాతం పోలింగ్ నమోదైంది. గూడూరు పట్టణంలో 75,938 ఓట్లు ఉండగా 50,797 ఓట్లు పోలవడంతో పోలింగ్‌శాతం 66.89గా, చిల్లకూరు మండలంలో 41,196 ఓట్లు ఉండగా 35,246 ఓట్లు పోల్‌కాగా 85.56శాతం, కోట మండలంలో 42,334 ఓట్లు ఉండగా 33,763 ఓట్లు పోలవడంతో 79.75శాతం, వాకాడు మండలంలో 30,246 ఓట్లు ఉండగా 25,113 ఓట్లు పోలవడంతో 83.03శాతం, చిట్టమూరు మండలంలో 31.948 ఓట్లు ఉండగా 27,671ఓట్లు పోలవడంతో 86.61శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఈ ఎన్నికల్లో గూడూరు మండలంలో గరిష్ఠంగా 88.67శాతం పోలింగ్ నమోదు కాగా, గూడూరు పట్టణంలో కనిష్ఠంగా 66.89శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ పరిధిలో 1,93,465 ఓట్లు పోల్‌కావడంతో 78.90శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మల్లాం దళితవాడకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ

చిట్టమూరు, మే 17: మల్లాం దళితవాడకు నిలిపివేసిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఈవోపీఆర్డీ మనోహర్ గౌడ్ చెప్పారు. ఈ నెల 10వ తేది మల్లాం దళితవాడకు సీపీడబ్ల్యూ స్కీం తాగునీటిని నిలిపివేయగా దళితులు ఆందోళన చేపట్టారు. ఎంపీడీవో నాగరాజు, ఎస్‌ఐ చిన్న బలరామయ్య ఆందోళనకారులతో చర్చించి ఎన్నికలు జరిగిన తరువాత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమింప జేశారు. ఈక్రమంలో ఈవోపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

టీడీపీ నాయకుడిపై హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్


నిందితులతో పోలీసులు

చిల్లకూరు, మే 17: మండలంలోని చింతవరం కొత్త పాళేనికి చెందిన టీడీపీ కార్యకర్త గోపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అదే గ్రామానికి చెందిన ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు. ఈనెల 14న చింతవరం కొత్త పాళేనికి చెందిన గోపాల్ చింతవరంలోని తన ఎరువుల దుకాణంలో ఉండగా క్రాంతికుమార్, దిలీప్‌కుమార్, చెంచయ్య దాడి చేశారు. ఈక్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

'చలో వెంకటగిరి'ని జయప్రదం చేయండి


వెంకటగిరిలో పోస్టరును ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

డక్కిలి/ వెంకటగిరి, మే 17: వెంకటగిరి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి నిరసనగా ఈనెల 20న జరుప తలపెట్టిన చలో వెంకటగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం డక్కిలిలో ఆయన చలో వెంకటగిరి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 12న విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఇప్పటి వరకు సంబంధిత వ్యక్తులను పోలీసులు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను వీలైనంత త్వరగా అదుపులోకి తీసుకుని శిక్షించాలని దళిత సంఘాల నాయకుడు జన్ని రమణయ్య అన్నారు. శుక్రవారం ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సహదేవయ్య మాట్లాడుతూ... అంబేడ్కర్ అందరి వాడని, ఈ విధ్వంస ఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించి 20 వతేదీన జరగబోయే చలో వెంకటగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రామకృష్ణ, ధనుంజయ, గద్దల మునెయ్య, మల్లారం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐకేఎస్‌తో వేదవర్సిటీ ఎంవోయూ

తిరుపతిరూరల్, మే 17: వైదిక సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న వైజ్ఞానిక విశేషాలను వెలికితీసి సమాజానికి అందించేందుకు తిరుపతిలోని ఎస్వీ వేద వర్సిటీతో భారతప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖకి చెందిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) ఎంవోయూ కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, ఐకేఎస్ జాతీయ కోఆర్డినేటర్ జి.సూర్యనారాయణ మూర్తి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐకేఎస్ కథనాలు రాయడం, పురాతన వేదగ్రంథాల ప్రామాణికమైన అనువాదాలను అన్ని భారతీయ భాషల్లోకి తీసుకురావడం ద్వారా కంటెంట్ అభివృద్ధి, మాన్యూస్క్రిప్ట్ డిజిటలైజేషన్, పురాతన పురాణాల నుంచి శాస్త్రీయ కంటెంట్‌తో సామాజిక ఔచిత్యంగల గ్రంథాలను గుర్తించడం, వాటిని సవరించడం, ప్రచురించడం, వేదమూలాలపై సెమినార్లు, వర్క్‌షాప్స్, కాన్ఫరెన్స్‌లు, వివిధ ఆచారాల ఆడియో-విజువల్ రికార్డులను రూపొందించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని వీసీ వివరించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, డీన్ గోలిసుబ్రహ్మణ్యశర్మ, రాధేశ్యామ్, ఎంపీఎస్ పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపుల వర్షం

గూడూరు/ డక్కిలి/ వాకాడు, మే 17: గూడూరు పట్టణంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండతీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోయారు. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో కొంత చల్లబడింది. శుక్రవారం సాయంత్రం తేలిక పాటి జల్లులు కురవడంతో ప్రజలు సేదతీరారు. డక్కిలిలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్న జనానికి ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షానికి అక్కడక్కడా చెట్లు కూలి విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మర్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. వాకాడులో కూడా గంటపాటు వర్షం కురిసింది. రబీ సీజన్ ప్రారంభంకావడంతో రైతులు పొలాలను దుక్కులు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న హోటళ్లు... దుకాణాలు



హైవే పక్కన పోరంబోకు భూమిలో ఏర్పాటు చేసిన దుకాణాలు, హోటళ్లు

దొరవారిసత్రం, మే 17: మండలంలోని నెలబల్లి వద్ద జాతీయ రహదారి పక్కన విలువైన ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా హోటళ్లు, దుకాణాలు వెలుస్తున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో గ్రామానికి చెందిన కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా రహదారిని ఆనుకుని ఉన్న భూముల్లో దుకాణాలు, హోటళ్లు ఏర్పాటు చేసి ఉన్నారు. ప్రధానంగా గ్రామానికి సమీపంలోని తెలుగుగంగ కాలువ వంతెన వద్ద రహదారికి ఆనుకుని పోరంబోకు భూమితో పాటు, సర్వే నెం.20లోకి వచ్చే కొంత సీజేఎఫ్ఎస్ భూముల్లో ఏర్పాటు చేశారు. లారీలు నిలుపుదలకు సౌకర్యంగా ఉన్న ప్రాంతం కావడంతో రాజకీయ ప్రాబల్యం ఉన్న వ్యక్తులు ఈ ఆకమణకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ భూముల్లో పంచాయతీ భాగస్వామ్యంతో దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆదాయం వస్తుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. హోటళ్లు, దుకాణాల అక్రమ నిర్మాణాలు తమ దృష్టికి రాలేదని డీటీ గోపినాథ్ చెప్పారు. తహసల్దార్ సెలవులో ఉన్నారని ఆయన రాగానే సర్వే చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వారిద్దరినీ అరెస్టు చేయండి

ఎస్‌ఐ, వైసీపీ నాయకుడిపై మండిపడ్డ టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 17: ఎన్నికల్లో వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించిన చిల్లకూరు ఎస్‌ఐ అంజిరెడ్డిని సస్పెండ్ చేయాలని, తమ పార్టీ నేతలపై దాడులకు ప్రోత్సహిస్తున్న చింతవరానికి చెందిన వైసీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పాశిం మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఎవరకి ఇష్టం వచ్చినవారికి వారు ఓట్లు వేసుకుంటారన్నారు. వైసీపీకి ఓటు వేయని వారిపై ఆ పార్టీ నాయకులు దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. చింతవరంలో టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్త జాలారి గోపాల్‌పై విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేయించడంతో గోపాల్ పరిస్థితి విషమంగా మారిందన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి రౌడ్‌షీటర్ అని పోలీస్ అధికారులకు తెలిపినా అతన్ని హౌస్‌అరెస్ట్ చేయకుండా బూత్‌ల సందర్శనకు అనుమతి ఏలా ఇస్తారని ప్రశ్నించారు. గోపాల్ వాగ్మూలం తీసుకోకుండా కేసును నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికల రోజు చిల్లకూరులో టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డిపై ఎస్‌ఐ అంజిరెడ్డి అమానుషంగా దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ సంఘటనలపై ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, నాయకులు ఎన్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురెడ్డి, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నరసింహులు, రవీంద్రరెడ్డి, జనార్దన రెడ్డి, పెంచలయ్య, రమణయ్య, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీకి కురుగొండ్ల పరామర్శ



వెంకటగిరి, మే 17: ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... కొంతమంది పోలీసులు వైసీపీ నాయకులకు కొమ్ముకాయడం వల్లే దాడులు, విధ్వంసాలు తలెత్తాయన్నారు. పోలీసుల అండ చూసుకునే వైసీపీ మూకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇంతమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు బదిలీ, సస్పెన్షను గురికావడం దేశ చరిత్రలో ఇప్పటివరకు జరగలేదన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అయితే ఒకే ఒక కానిస్టేబుల్ నియమించడం దారుణమన్నారు.

దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకుంటున్న కురుగొండ్ల

అంచనాలకు అందని ఓటరు నాడి

- ఓటింగ్ సరళిపై ఎడతెగని సమీక్ష
- అధికార పార్టీకి క్రాస్ ఓటింగ్ బెడద



సూళ్లూరుపేట, మే 17: గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ నమోదైంది. ఓటర్లు క్యూలైన్లలో గంటల కొద్దీ వేచి ఉండి మరీ ఓట్లు వేశారు. అయినా వారి నాడి అర్థం కాక బరిలో ఉండే అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు లోలోపల అసమ్మతి బెడద ఎదురైంది. ఈ ప్రభావం ఎవరిపై పడుతుందో.. ఎవరి ఓట్లను కొల్లగొడుతుందో అంచనా వేయలేక మూడు రోజులుగా నాయకులు కుస్తీలు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ముగిసి నాలుగు రోజులు కావడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు లోలోపల విశ్లేషణలు చేస్తున్నారు. కూటమి అభ్యర్థులకు అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరు గుర్తులు ఉండటంతో క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం చేకూరుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌కు కూడా ఓట్లు పోలయ్యాయని చర్చ సాగు తోంది. కాంగ్రెస్ పడిన ఓట్లు ఏ పార్టీకి లాభం చేకూరుతుందో, ఏ పార్టీకి నష్టం చేకూరుతుందో తెలియక తలలు పట్టుకొంటున్నారు. దీనికి తోడు ఈ సారి నిరుద్యోగులు, విద్యావంతులు, బెంగళూరు, చెన్నై, హైదరాబాదులో పని చేసే సాఫ్ట్‌వేరు ఇంజినీర్లు ఎన్నడూ లేని విధంగా సొంతూళ్లకు వచ్చి క్యూలో గంటల తరబడి నిలబడి మరీ ఓట్లు వేయడం గమనార్హం. ఇదంతా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లని కూటమి అభ్యర్థులకు ఇది కలిసి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఓట్లు కూడా పెరగడంతో వారి నాడి ఎవరికి అంతు బట్టడం లేదు. ఇది టీడీపీ ప్రవేశ పెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల ఎఫెక్ట్ అని కూటమి అభ్యర్థులు చెబుతుంటే ఇది జగన్ మహిళలకు అందజేసిన సంక్షేమ పథకాలేనని వైసీపీ గట్టిగా నమ్ముతోంది. ఓటింగ్ పెరగడం, చీలికలు, క్రాస్ ఓటింగ్ ఎవరి స్థితిగతుల్ని మార్చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

అధికార పార్టీకి క్రాస్ ఓటింగ్ బెడద..

అధికార వైసీపీకి క్రాస్ ఓటింగ్ బెడద ఆ పార్టీ నేతలను కలవరపెడుతోంది. దీనికి తోడు కాంగ్రెస్ కూడా తమ ఓటుబ్యాంక్‌కు చీల్చిందని ఆందోళన చెందుతున్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో క్రాస్ ఓటింగ్ అధికంగా జరిగిందని ఆ పార్టీకి చెందిన నాయకులే చెప్పుకుంటున్నారు. పొత్తులో భాగంగా సూళ్లూరుపేటలో అసెంబ్లీ టీడీపీ, ఎంపీ బీజేపీకి కేటాయించారు. దీంతో ఇక్కడ గుర్తులు మారడంతో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ఇది టీడీపీ అసెంబ్లీ అభ్యర్థికి బాగా కలిసి వచ్చే అవకాశంగా భావిస్తున్నారు. ఈ క్రాస్ ఓటింగ్ విజయశ్రీని విజయతీరానికి చేరుస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు.

వెంకటగిరిలో దంచికొట్టిన వాన


ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిచి ఉన్న నీరు

వెంకటగిరి, మే 17: అనూహ్య వర్షం కొందరికి ఉపశమనాన్ని కలిగిస్తే మరి కొందరికి ఇబ్బందికరంగా మారింది. ఉరుములు మెరుపులతో సుమారు గంటపాటు కురిసిన వర్షానికి స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. ఎన్టీఆర్ కాలనీలో రోజుల తరబడి మురుగు నీటి కాలువల్లో చెత్త తీయకపోవడంతో శుక్రవారం కురిసిన వర్షానికి మురుగు రోడ్లపై ప్రవహించింది. అలాగే పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షానికి చెట్ల కొమ్మలు విద్యుత్ తీగాపై పడటంతో పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తం కావడంతో రెండు గంటల్లో తిరిగి విద్యుత్ సమస్య తీరింది.

కుట్టు మెషిన్ వితరణ



వెంకటగిరి, మే 17: పట్టణంలోని తోలుమిట్టకు చెందిన కవితకు శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ ట్రస్టు ఆధ్వర్యంలో కుట్టు మెషిన్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు టి.కృష్ణయ్య మాట్లాడుతూ... ముందు ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామన్నారు. కె. వెంకటేశ్వర్లు, కె.తిరుపాలు, పి.తులసీదాస్, ఎం.రవీంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కోట, మే 17: కోట దళితవాడలో వివాహితపై అదే దళితవాడకు చెందిన కోటమ్మ, మరో ఐదుగురు మహిళలు దాడి చేయడంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు శుక్రవారం తెలిపారు. గత కొంతకాలంగా సరిత, కోటమ్మ మధ్య స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వివాదం ముదిరి సరితపై దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు


పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ

కోట, మే 17: గ్రామాల్లో ప్రజలు కోరిన చోటే ఉపాధి హామీ పథ కం పనులు మంజూరు చేయాలని, ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథక అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్ హెచ్చరించారు. మండలం లోని సిద్ధవరం, ఉత్తమనెల్లూరు పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను శుక్ర వారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలకు, సిబ్బందికి పలు సూ చనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి కుటుంబానికి వందరోజుల పనులు కల్పిం చాల్సిందే అన్నారు. తేడాలొస్తే సంబంధిత క్షేత్ర సహాయకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈసీజన్‌లో పశువులు తాగే నీటిగుంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్ శాంతి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 76,369 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,927 మంది తలనీలాలు సమర్పించారు.


కాకినాడ బ్యాండ్ మేళా

కోటమ్మ ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారి గ్రామోత్సవం

కోట, మే 17: మండలంలోని తిన్నెలపూడిలో శుక్రవారం తెల్లవారు జామున గ్రామదేవత కోటమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఊరేగింపులు, బ్యాండు మేళాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి నివాసమైన కోట నుంచి అమ్మవారి నగలు, గంగపెట్టె, మేళ తాళాలతో తిన్నెల పూడికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి తిన్నెలపూడి గ్రామస్తులు మేకపోతులు, పొట్టేళ్లతో ఎదురు పొంగళ్లు నిర్వహించారు. కాకి నాడ బ్యాండ్ ఆధ్వర్యంలో నృత్యాలను ఏర్పాటు చేసి కోటమ్మ ఉత్సవ విగ్ర హాన్ని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మ వారు ఊరేగుతున్న సమయంలో ఆయా గ్రామాల భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి ఎదురు పొంగళ్లు నిర్వహించారు. దశాబ్దకాలం తరువాత ఈ తరంనాటి యువతి, యువకుల ఆధ్వర్యంలో కోటమ్మ అమ్మవారి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ప్రారంభం


పుష్పాలంకరణలో బ్రహ్మేంద్రస్వామి దంపతులు

సూళ్లూరుపేట, మే 17: పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి మఠంలో శుక్రవారం నుంచి ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టేటి పెరుమాల్ ఆధ్వర్యంలో ఉదయం మఠం వద్ద గో పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి పూజ అనంతరం స్వామివారి మఠం ముందు ఏర్పాటు చేసి హోమగుండంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరగనుంది. కమిటీ సభ్యులు చెంగయ్య, బట్టా సుబ్రమణ్యం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

20నుంచి కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



నాయుడుపేట, మే 17: పట్టణానికి సమీపంలో ఉన్న తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి దేవస్థానంలో 20వ తేది నుంచి టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 20న అంకుర్పాణ, 21న ధ్వజారోహణం, రాత్రి శేషవాహనసేవ, 22న తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుమంతసేవ, 23న ద్వారదర్శనం, రాత్రి గరుడవాహనసేవ, 24న తిరుచ్చి ఉత్సవం, రాత్రి హంసవాహనం, 25న తిరుచ్చి ఉత్సవం, రాత్రి విమానోత్సవం, 26న మోహినీ ఉత్సవం, సింహవాహనం, గజవాహన సేవలు, కల్యాణం, 27న రథోత్సవం, 28న తిరుచ్చి ఉత్సవం, రాత్రి పార్వేట ఉత్సవం, 29న వసంతోత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 30న పుష్పయాగం, రాత్రి ఏకాంతసేవ జరుగుతాయి.

లక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవాలు

వెంకటగిరిటౌన్, మే 17: మండలంలోని వల్లివేడు(9వ బెటాలియన్) సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి 64వ జయంతి మహోత్సవాలు 22వ తేది సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. అభిషేకం, స్వామివారి కల్యాణం, అన్నదానం, చందనాలంకారం, భజన, గరుడోత్సవం నిర్వహించనున్నారు. 23వ తేది పొంగళ్ల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఏకొల్లువాసికి డాక్టరేట్ ప్రదానం


తిరుపాలయ్య

దొరవారిసత్రం, మే 17: మండలంలోని ఏకొల్లువాసి కన్నలి తిరుపాలయ్యకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తిరుపాలయ్య నాయుడుపేట సెజ్ ఐలా కమిషనర్‌గా పని చేస్తు న్నారు. ఆయనకు ఆచార్య నాగార్జున వర్శిటీలోని జర్న లిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిత ఆధ్వర్యంలో 'ఇంపాక్ట్ ఆఫ్ అడ్వర్టైజ్మెంట్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు సెమియోటిక్స్ అండ్ అదర్ ఫ్యాక్టర్ - ఏ స్టడీ ఆఫ్ కస్టమర్ పెర్సెప్షన్ ఇన్ అమరావతి క్యాపిటల్ రీజియన్' అనే అంశంపై పరిశోధన చేశారు.

ఉపాధి కూలీల ధర్నా

పెళ్లకూరు, మే 17: తమకు కూలీలు చెల్లించాలంటూ మండలంలోని శిరసనంబేడుకు చెందిన ఉపాధిహామీ కూలీలు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము ఆరు రోజుల పాటు కూలి చేస్తే మూడు రోజులకు మాత్రమే బిల్లు పెట్టారన్నారు. మిగితా మూడు రోజులు పనులకు సంబంధించిన వేతనాలను పనులకు రాని వారి పేర్లు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఎంపీడీవోకు, ఏపీవోకు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవ పనులను శుక్రవారం పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు క్యూలైన్లలో ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. శనివారం నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణం జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, బాలాజీ, మురళి, లక్ష్మయ్య, సుదర్శన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



స్వర్ణ కవచం అలంకారంలో దక్షిణకాళికాదేవి

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



కనకదుర్గమ్మ

శ్రీకాళహస్తి, మే 17: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం శుక్రవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు,మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



అమ్మవారి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తిరుమల ఘాట్‌లో వ్యాను బోల్తా

అదుపుతప్పి కొండను ఢీకొన్న కారు

12 మంది చెన్నై భక్తులకు స్వల్పగాయాలు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. చెన్నైకి చెందిన 12 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఎనిమిది మంది భక్త బృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఓ వ్యానులో శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. అలిపిరికి సమీపంలో మాల్వాడిగుండం వద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. అదృష్టవశాత్తూ వాహనంలోని వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో వెనుకవస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ కూడా ఒక్కసారిగా అదుపుకోల్పోయింది. సడన్ బ్రేక్ వేయడంతో వాహనం జారి.. రోడ్డుగా అడ్డుగా నిలబడింది. అలాగే 19వ మలుపు వద్ద కూడా ఓ కారు కూడా అదుపుతప్పి కుడివైపునున్న కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోనూ చెన్నైకి చెందిన నలుగురు భక్తులు స్వల్పగాయాలో బయటపడ్డారు. వర్షం పడటంతోనే ఈప్రమాదాలు చోటుచేసుకున్నట్టు భక్తులు తెలిపారు.

పుత్తూరు వార్తలు

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం



మృతదేహాలకు దహన క్రియలు చేస్తున్న తండ్రి బాబు

వడమాలపేట, మే 17: ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి చెందడంతో ఎస్‌బీఆర్ పురం శోకసంద్రంలో మునిగిపోయింది. వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు రూపిక(10), చరిత(13), యామిక గురువారం దిగువ గూళూరు గూళూరు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాలను తీసుకువచ్చారు. చిన్నారుల మృతదేహాలను చూసిన బంధువులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి బాబు తన కుమార్తెల మృతదేహాలకు దహన క్రియలు నిర్వహించారు.

బస్సును ఢీకొన్న బైక్

యువకుడి మృతి



మాతయ్య (ఫైల్‌ఫొటో)

పిచ్చాటూరు, మే 17: మండల కేంద్రమైన పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మాతయ్య(22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. శివగిరి అరుంధతివాడకు చెందిన వెంకటేష్ కుమారుడు మాతయ్య తల్లి అనారోగ్యంతో ఉండడంతో మందులు తీసుకొచ్చేందుకు పిచ్చాటూరుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశ్వరులు సంఘటనా స్థలానికి చేరుకుని మాతయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రేణిగుంటలో మోస్తరు వర్షం

రేణిగుంట, మే 17: రేణిగుంట పట్టణంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడిపోతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతం అయింది. సుమారు అరగంట పాటు సన్నటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

ఉచిత భోజనాన్నీ సరఫరా చేయలేరా?

- పేదల కోసం ఆహారం అందజేస్తున్న ముక్కంటి ఆలయం
- దాన్ని ఆస్పత్రికి చేర్చేందుకు నిధులు లేవంట
- రోజుకు రూ.200 వెచ్చించలేక ఆగిన సరఫరా
- పేదలకు తప్పని పస్తులు



శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో పేదలకు ఆకలి కేకలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ప్రజా అవసరాలు తమకేమీ పట్టనట్లు పాలకులు, అధికారులు గాలికి వదిలేశారని నిత్యం విమర్శలు వెలువెత్తుతూనే ఉన్నాయి. ముక్కంటి ఆలయం నుంచి ప్రతిరోజూ ఉచితంగా వచ్చే భోజనాన్ని కూడా పంపిణీ చేయకుండా కేవలం ఆటో అద్దె చెల్లించలేమని సాకు చూపుతూ మంగళం పాడేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కాంట్రాక్టు ద్వారా మూడు పూట్ల నిర్థిష్టమైన పరిమాణంలో ఆహారం అందజేస్తుంటారు. అయితే ఇది కేవలం అడ్మిషన్‌లో ఉన్న రోగులకు మాత్రమే సరఫరా చేస్తారు. అడ్మిషన్‌లో ఉన్న రోగులతో పాటు వారి సంబంధీకులు ఆస్పత్రిలో పెద్ద ఎత్తున నిరీక్షిస్తుంటారు. ఇక మధ్యాహ్నం ఓపీ సమయంలో వందలాది మంది రోగులు, వారి సంబంధీకులు ఆస్పత్రికి వస్తుంటారు. మధ్యాహ్న భోజనం అవసరమైన వారంతా ఆర్టీసీ కూడలికి వెళ్లక తప్పదు. ఈ సమస్యను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసింది. ఆస్పత్రికి వచ్చేవారంతా రూ.5కే నాణమైన భోజనం అందుబాటులో ఉండడంతో పెద్దఎత్తున ప్రజలు ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నా క్యాంటీన్ మూత పడిన విషయం తెలిసిందే. ఇక మళ్లీ ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనం కోసం ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటినుంచి పలువురు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆస్పత్రిలో ఉచిత భోజనం అమలు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. పలుమార్లు ముక్కంటి ఆలయ అధికారులకు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో గత యేడాది అక్టోబరులో ముక్కంటి ఆలయ నిత్యాన్నదానం నుంచి ఉచితంగా ఆస్పత్రికి భోజనం సరఫరా చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం ప్రతిరోజూ మధ్యాహ్నం సుమారు 150 మందికి ఆలయం నుంచి భోజనం సరఫరా చేశారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ యేడాది మార్చి 1 నుంచి ఆస్పత్రిలో ఉచిత భోజనం పంపిణీ ఆగిపోయింది. ఆలయం నుంచి ఉచితంగా భోజనం ఇచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ ప్రతిరోజూ భోజనం ఆస్పత్రికి చేరేందుకు, తిరిగి పాత్రలు ఆలయానికి చేరేందుకు రూ.200 ఆటో బాడుగ అవుతుంది. ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిధుల నుంచి వెచ్చించలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. ఆస్పత్రిలో మెయింటెనెన్స్ నిధులు వెచ్చించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఉచిత భోజనానికి మంగళం పాడేశారు. రూ.12కోట్ల నిధులతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేశామని నిత్యం పాలకులు, అధికారులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆటో బాడుగ కట్టలేమంటూ నిరుపేదల కడుపు కాలుస్తున్నారు. ఈ సమస్య తెలుసుకున్న కొందరు దాతలు ఇటీవల తాము ఆటో అద్దె చెల్లిస్తామంటూ ముందుకు వచ్చారు. కానీ ఆస్పత్రి అధికారుల్లో కనికరం కలగలేదు. ఏదో కారణంతో పేదలకు అన్నాన్ని దూరం చేస్తూనే ఉన్నారు. ఈ నిర్లక్ష్యపు చర్యతో ప్రభుత్వాస్పత్రిలో ప్రతిరోజూ మధ్యాహ్నం పేదలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయం నుంచి వచ్చే నోటి కాడ కూడును లాగొద్దు అంటూ రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దళితుల భూముల్లో ఇసుక ఎత్తితే తిరుగుబాటు తప్పదు

వైసీపీ నేత, విక్రుతమాల ఎంపీటీసీ రవిని హెచ్చరించిన సీపీఐ నేతలు



ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వైసీపీ నేత రవితో సీపీఐ నేతల వాగ్వాదం - గుడిమల్లం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

ఏర్పేడు, మే 17: దళితుల భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమ రవాణాకు పాల్పడితే తిరుగబాటు తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి హెచ్చరించారు. ఏర్పేడు మండలం గుడిమల్లం దళితవాడకు చెందిన సాంబయ్య పొలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వైసీపీ నేత, విక్రుతమాల ఎంపీటీసీ రవిని శుక్రవారం సీపీఐ నేతలు అడ్డుకున్నారు. దళితుల భూముల్లో ఇష్టారాజ్యంగా ఇసుకను తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఇకమీదట ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరపబోమని చెబుతూ వైసీపీ నేత రవి అక్కడి నుంచి ట్రాక్టర్లను తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ రవితో పాటు మోహన్, ప్రసాద్ అనే వ్యక్తులు ప్రతిరోజు దళితుల భూముల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. గత వారంరోజులుగా సాంబయ్యకు చెందిన మూడు ఎకరాల పొలంలో రాత్రి వేళలో ఇసుక తవ్వకాలు జరిపి రవాణా చేసి సొమ్ము చేసుకున్నారని చెప్పారు. ఇంత జరగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని చెప్పారు. తక్షణమే పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని, దళితుల భూముల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలురాధా కృష్ణ, శ్రీరాములు, నాగరాజు, చిన్నం కాళయ్య, బలరాం, కృష్ణ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయ ధ్వజస్తంభం వద్ద పంకజ్ అగర్వాల్‌తో అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మే 17: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం కేంద్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి పంకజ్ అగర్వాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నామినేటెడ్ పదవుల్లో ఉన్న రాజకీయ నేతలు అధికారుల ప్రోటోకాల్‌కు హాజరు కాకూడదు. అయితే ఐఏఎస్ అధికారి పంకజ్ అగర్వాల్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలకాల్సి ఉండగా చైర్మన్ శ్రీనివాసులు ప్రోటోకాల్ వ్యవహారాన్ని నిర్వహించారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



సుబ్బానాయుడు (ఫైల్‌ఫొటో)

వరదయ్యపాళెం, మే 17: వరదయ్యపాళెం మండలం కడూరు గ్రామానికి చెందిన బుదూరు సుబ్బానాయుడు(78) వడదెబ్బతో మృతి చెందాడు. సుబ్బానాయుడు వారం రోజుల కింద బహిర్భూమికి వెళ్లాడు. ఎండ వేడిమికి అక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులను ఆయనను వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

అధిక ఉప్పు... ఆరోగ్యానికి ముప్పు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు, మే 17: అధిక ఉప్పుతో ఆరోగ్యానికి ముప్పు తప్పదని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధిక రక్తపోటు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, కిడ్నీ సంబంధిత సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇదేగాక రక్తపోటు తీవ్రస్థాయిలో పెరిగినప్పుడు తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఒక బిలియన్ మంది అధిక రక్తపోటుతో ఇబ్బందులు పడుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సాధారణంగా రక్తపు పోటు 120/80 ఉండాలన్నారు. అయితే అధిక రక్తపోటు నియంత్రించుకోవడానికి పొటాషియం అధికంగా ఉండే ఆకుకూరలు, బంగాళాదుంపలు, అరటి పండ్లు వంటివి ఆహారంగా తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు ఆహారంలో ఉప్పును తగ్గించుకుంటే హైబీపీ సమస్య ఉత్పన్నం కాదని, దీంతో పాటు ప్రతిరోజు అర్థగంట పాటు నడవడం, వ్యాయామం చేసినట్లయితే అధిక రక్తపోటును కంట్రోల్ చేసుకోవడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు మురళీకృష్ణ, ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, హెడ్ నర్సులు పార్వతి, వనజాక్షి, హెల్త్ సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఫార్మాసిస్టు భార్గవి, ల్యాబ్ టెక్నిషియన్ మురళీమోహన్, హెల్త్ అసిస్టెంట్ షణ్ముఖం, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకురాలి మృతి



నరసమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలం

కేవీబీపురం, మే 17: మండలంలోని సదాశివపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు నరసమ్మ(70) గురువారం రాత్రి మృతి చెందారు. ఆమె భౌతిక దేహానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓటమి భయంతోనే నానీపై దాడి

వరదయ్యపాళెం, మే 17: ఓటమి భయంతోనే చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ గుండాలు హత్యాయత్నం చేశారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పులివర్తి నానీని పరామర్శించారు.

సుగవాసి బాలసుబ్రహ్మణ్యంకు సన్మానం



బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న కాసరం రమేష్

శ్రీకాళహస్తి, మే 17: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను ఆయన స్వగృహంలో శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు, టీడీపీ నాయకుడు కాసరం రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. జూన్ 4న జరిగే ఎన్నికల లెక్కింపులో సుగవాసి బాలసుబ్రహ్మణ్యం అత్యంత మెజార్టీతో గెలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంఠా అశోక్, మునిరత్నం, సుబ్బు, సుగవాసి రూజిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ కొలువు



ముత్యాలమ్మ కొలువులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు

పిచ్చాటూరు, మే 17: పిచ్చాటూరు మండలం కీళపూడి గ్రామంలో వెలసి ఉన్న ముత్యాలమ్మ కొలువును నాగలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ సునంద పద్మనాభ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ కొలువులో డాక్టర్ వి.దివ్య, డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఆదిమూలం గెలుపు కోసం పూజలు



మురుగన్ ఆలయంలో టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, మే 17: ఎన్డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం గెలుపు కోసం శుక్రవారం టీడీపీ నాయకులు తమిళనాడులోని తిరుచెందూరు మురుగన్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పద్దురాజు, జయచంద్రనాయుడు, వాసు, దొరవేలు, చిన్న, రవి, వినాయక, త్యాగరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఛలో వెంకటగిరిని విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, మే 17: ఛలో వెంకటగిరిని విజయవంతం చేయాలని జైభీమ్ ఆర్మీ నాయకులు పులి శ్రీకాంత్ శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తలను ఐదు రోజుల క్రితం పగలగొట్టారన్నారు. ఇందుకు నిరసనగా సోమవారం ఉదయం 9.30 గంటలకు ఛలో వెంకటగిరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ ఉన్నారు.